## క్లుప్తంగా

### పార్టీ అధినేతను కలిసిన వెంకటేగౌడ


జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే

పలమనేరు: లండన్ పర్యటన ముగించుకుని బెంగళూరుకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం కలిసినట్లు తెలిపారు.

### ఎంపీడీఓగా విజయ్‌దత్

కుప్పం: కుప్పం మండల పరిషత్ అభివృద్ధి ఇన్‌చార్జి అధికారిగా విజయ్‌దత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీఓ సాయి లహరి బదిలీ కావడంతో ఈఓఆర్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న విజయ్ దత్‌కు ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. ఈఓపీఆర్‌డీగా రమ్యకృష్ణను నియమించారు.

### 2న టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

వి.కోట: ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 2న స్థానిక విద్యానికేతన్ కళాశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల అధినేత దామోదరంరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.20వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, 4వ స్థానంలో నిలిచిన 10 మంది విద్యార్థులకు రూ.1000 చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని ఏ స్కూలు విద్యార్థులైనా పాల్గొనవచ్చని, ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. పూర్తి వివరాల కోసం 9550314333, 9652850950 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### ఉద్యోగ విరమణ టీచర్‌కు సన్మానం



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేట జెడ్పీ హైస్కూల్లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న లోకనాథం శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. శేషజీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఎంఈఓలు సిద్దరామయ్య, తాతయ్య, హెచ్‌ఎం ఫజుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బైక్ నుంచి కింద పడిన టెట్రా ప్యాకెట్లు!

- కోర్టు ముందే ఘటన
- వాటిని వదిలి పరారైన నిందితుడు


రోడ్డుపై పడిన కర్ణాటక టెట్రా ప్యాకెట్లు

పలమనేరు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లు బైక్ నుంచి కింద పడడంతో వారిని వదిలేసి నిందితుడు బైక్‌తో ఉడాయించిన సంఘటన శుక్రవారం పట్టణ సమీపంలోని ఆర్టీఓ, కోర్టు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద చోటుచేసుకుంది. మద్యం ప్యాకెట్లను బైక్ ముందు పెట్టుకుని వస్తుండగా బైక్ అదుపుతప్పడంతో ఆ ప్యాకెట్లు రోడ్డుపై పడ్డాయి. దీంతో భయపడిన ఆ వ్యక్తి వాటిని వదిలేసి ఉడాయించాడు. హైవేలో యథేచ్ఛగా కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు ఈ ఉదంతంతో బట్టబయలైంది.

### వీధిబాలల హక్కులను కాపాడుదాం


మాట్లాడుతున్న లాయర్ భాస్కర్

పలమనేరు: వీధి బాలల హక్కులను కాపాడేందుకు సమాజం ముందుండాలని న్యాయవాది ఎల్ భాస్కర్ కోరారు. పట్టణంలోని నార్త్ పాఠశాలలో శుక్రవారం ప్రపంచ వీధి బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వీధి బాలురని ఎవరైనా అవహేళన చేస్తే చర్యలు తప్పవన్నారు. వారికి సైతం ప్రత్యేక చట్టాలున్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, పాఠశాల హెచ్‌ఎం ఇందిర, ఏఎస్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక రిజిస్ట్రేషన్ల బాదుడు



రిజిస్ట్రేషన్లతో పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందడానికి కూటమి ప్రభుత్వం భూముల రేట్లు అమాంతంగా రేట్లు. గజం స్థలంపై రూ. 8వేల వరకు పెంచడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పట్టణ ప్రాంతాలకు సమీపంలోని భూముల ధరలు పెరగనున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి రిజిస్ట్రేషన్లకు రెట్టింపు ధర చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. దీంతో వివిధ లావాదేవీల నిమిత్తం జనవరి 31న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జనంతో కిక్కిరిసింది. సర్వర్లు మొరాయించడంతో క్రయ విక్రయదారులు ఆందోళన చెందారు.

- నేటి నుంచి రిజిస్ట్రేషన్ ఫీజులు పెంపు
- చివరి రోజు కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- మొరాయించిన సర్వర్
- ఆస్తుల క్రయ విక్రయదారుల ఆందోళన
- రియల్ ఎస్టేట్‌పై ప్రభావం


కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట జనసందోహం

కుప్పం: మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం కల్లలు చేస్తోంది. భూముల ధరలు పెంచిన నేపథ్యంలో స్థిరాస్తి రంగంపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక శాతం రిజిస్ట్రేషన్ చార్జీలను పట్టణ ప్రాంతాలు, సమీప ప్రాంతాల్లోను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి 1 నుంచి భూముల రిజిస్ట్రేషన్ల పరంగా పేదలు, సామాన్య ప్రజలకు అదనపు భారం పడనుంది. ఫిబ్రవరి 1 నుంచి భూముల రిజిస్ట్రేషన్ల ఫీజులు ప్రభుత్వం పెంచనుండడంతో రెండు రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జనంతో కిక్కిరిసింది. దీంతో సర్వర్లు మొరాయిస్తుండంతో గంటల తరబడి నిరీక్షించి భూముల రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సిన పరిస్థితి కలిగింది. ఎప్పుడూ లేని విధంగా జనవరి చివరి రెండు రోజులుగా రిజిస్ట్రేషన్లు జోరందుకున్నాయి. పెరగనున్న రిజిస్ట్రేషన్లు ఫీజులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది సైతం డేటా అప్‌డేట్ చేసేందుకు ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా ఒక్క రోజు రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో క్రయవిక్రయదారులు ఆందోళన చెందారు. ఒక్కసారిగా పెరగనున్న రిజిస్ట్రేషన్ ఫీజులు భరించలేమని తమకు అవసరాన్ని బట్టి భూముల రిజిస్ట్రేషన్లు సైతం పూర్తి చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు.

**ఇక ఫీజుల మోత..!**

శనివారం నుంచి రిజిస్ట్రేషన్ ఫీజులు 10 నుంచి 20 శాతం పెరగనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో కుప్పం రూరల్, అర్బన్ ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ల ధరలు అమాంతంగా పెరగనున్నాయి. మారుమూల ప్రాంతం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుప్పం స్థానికులు రిజిస్ట్రేషన్ ఫీజులు పెరిగితే క్రయ విక్రయాలు తగ్గిపోయే అవకాశం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

### సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సదుం: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ హరిబాబు తెలిపారు. మండలానికి 49 యూనిట్లు మంజూరు అయ్యాయని, ప్రభుత్వం గరిష్ఠంగా 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఫిబ్రవరి 7 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### పశువుల సంత తనిఖీ


పశువుల సంతను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారిణి ఇందుమతి

పలమనేరు: పట్టణ సమీపంలోని క్యాటిల్ ఫామ్ వద్ద శుక్రవారం పశువుల వారపు సంతను మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ అధికారిణి ఇందుమతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడికి వారానికోసారి వస్తున్న పశువులు, అక్కడ ఉన్న సౌకర్యాలు, సమస్యలను రైతులను అడిగి ఆమె తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక మార్కెట్ కమిటీ సెక్రటరీ సంజీవకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## పరాశురామ్ సేవలు వెలకట్టలేనివి


హెచ్‌ఎం పరుశురామ్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థుల భవితకు బాటలు వేసిన హెచ్‌ఎం పరాశురామ్ సేవలు వెలకట్టలేనివిగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కొనియాడారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పశురామ్ ఉద్యోగ విరమణ పొందారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆయనకు వీడ్కోలు సన్మానం చేశారు. జెడ్పీ చైర్మన్ ఆయన్ను సత్కరించి మాట్లాడారు.

**నివాళి**

మండలంలోని చాడేపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు ప్రసాద్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఆ గ్రామానికి వెళ్లారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## వీధి బాలల భవితకు కృషి చేద్దాం


వీధి బాలలకు అవగాహన కల్పిస్తున్న బాబు

రొంపిచెర్ల: వీధి బాలల సంరక్షణకు, వారికి మంచి జీవితం ప్రసాదించేందుకు ప్రజలు తమవంతు కృషి చేయాలని, సహకారం ఇవ్వాలని గ్రేట్ విజన్ సొసైటీ అధ్యక్షుడు జీవీఎస్.బాబు కోరారు. వీధి బాలల దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో వీధి బాలలను కలసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, పేదరికం, కుటుంబ సమస్యలు, వలసల కారణంగా వీధి బాలలు తమ జీవితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి బాలలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి శాశ్వత ఆశ్రయం, ఆరోగ్య సంరక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీధి పిల్లల భవితకు తాము సిద్ధంగా ఉన్నామని, చిత్తూరును వీధి బాలల రహిత జిల్లాగా ప్రభుత్వం చేయాలనన్నారు.

### మద్యం షాపు మంజూరు

కుప్పం: గుడుపల్లె మండల జనాభా ప్రాతిపదికన కుప్పం నియోజకవర్గానికి అదనంగా ఈడిగ సామాజిక వర్గానికి మద్యం షాపు మంజూరైనట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ నాగరాజు తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఈడిగ కులస్తులతో సీఐ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కుల, స్వగ్రామ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఆన్‌లైన్ ద్వారా రూ.2 లక్షల చలానును డీడీ రూపంలో జత చేసి మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈడిగ సామాజిక వర్గ నాయకులు సుధాకర్, నారాయణ మూర్తి, శివశంకర్, త్యాగరాజు, కృష్ణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గురుకులానికి విద్యాసామగ్రి వితరణ


విద్యాసామగ్రితో గురుకుల పాఠశాల విద్యార్థినులు

పలమనేరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలకు బెంగళూరుకు చెందిన జాప్ స్పాట్ సంస్థ నిర్వాహకులు ముఖేష్ సింగ్ రూ.లక్ష విలువైన విద్యాసామగ్రిని శుక్రవారం అందజేశారు. వీటిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు, ప్రకాష్‌రెడ్డి , ప్రిన్సిపల్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఎరువులు విక్రయించాలి


అరగొండలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

తవణంపల్లె: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని వ్యవసాయ శాఖ ఏడీ శివకుమార్ డీలర్లను ఆదేశించారు. మండలంలోని అరగొండలో శుక్రవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. దుకాణాల వద్ద ఎరువులు, పురుగు మందులకు సంబంధించి స్టాక్‌ను, ధరల పట్టికను నోటీస్ బోర్డులో దుకాణం బయట ఉంచాలని ఆదేశించారు. ఎరువులు, పురుగు మందులు కొన్న రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తవణంపల్లె వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలి


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు

ఐరాల: గ్రామ సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని, సమయపాలన పాటించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు ఆదేశించారు. మండలంలోని ముదిగోళం సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ప్రజా సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. బయోమెట్రిక్ హాజరును తప్పక వేయాలని సూచించారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ఎప్పటికప్పుడు అర్హులైన పేదలకు చేరవేయవలసిన ప్రధాన బాధ్యత సచివాలయ ఉద్యోగులదే అన్నారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యదర్శికి సూచనలు–సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, మూడేళ్లలోపు చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మధు పాల్గొన్నారు.

### డ్రోన్ల వాడకం పెరగాలి


డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సంధ్య

పలమనేరు: వ్యవసాయంలో డ్రోన్ల వాడకం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయాధికారి సంధ్య అన్నారు. మండలంలోని కల్లాడులో శుక్రవారం ఆమె సిబ్బందితో కలసి డ్రోన్ల వాడకం, నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ పనుల్లో కూలీల సమస్య లేకుండా డ్రోన్లతో సులభంగా మందులను పిచికారీ చేసుకోవచ్చని, రైతులు దీనిపై మొగ్గు చూపాలని కోరారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### రోడ్డు పనులకు మరోసారి మార్కింగ్


మార్కింగ్ పనులు చేస్తున్న ఏసీపీ, సిబ్బంది

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి అధికారులు శనివారం మరోసారి మార్కింగ్ ప్రారంభించారు. కట్టమంచి నుంచి కలెక్టరేట్ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేయాల్సి ఉంది. ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు ఎంఎస్ఆర్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు మార్కింగ్ పనులు పూర్తి చేశారు. ఇక కట్టమంచి నుంచి ఎంఎస్ఆర్ వరకు వంద అడుగుల మేరకు రోడ్డు విస్తరణ చేయడానికి అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది మార్కింగ్ పనులు చేస్తున్నారు. ఇది పూర్తయిన తరువాత ప్లాన్ రూపొందించి ఆపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


డైరీ ఆవిష్కరిస్తున్న డీఈవో, ఆప్టా నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ టీచర్స్ ప్రైమరీ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీపతి, మునాఫ్ కోరారు. అసోసియేషన్‌నాయకులు శుక్రవారం డీఈవో వరలక్ష్మి చేతుల మీదుగా నూతన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించి వినతి పత్రం అందజేశారు. డీఈవోతో నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు త్వరితగతిన చేపట్టాలన్నారు. సీనియారిటీ జాబితాలను పకడ్బందీగా సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆప్టా నాయకులు అన్సర్, శంకర్ రెడ్డి, యమున తదితరులు పాల్గొన్నారు.

### రెండో రోజు కొనసాగిన తనిఖీలు


యాదమరిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

యాదమరి(కాణిపాకం): యాదమరి మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు జిల్లా వ్యాప్తంగా రెండో రోజు కొనసాగుతున్నాయి. పుంగనూరు సహాయకులు శివకుమార్, తవణంపల్లె మండల అధికారి ప్రవీణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులు, నిల్వలు, ధరల పట్టిక తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణదారులు తప్పనిసరిగా కొనుగోలుదారులకు బిల్లులు ఇవ్వాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ర్యాష్ డ్రైవింగ్ వద్దు

- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవద్దు
- విద్యార్థులకు ఎంవీఐ మధుసూదన్‌రెడ్డి హితవు



మాట్లాడుతున్న ఎంవీఐ మధుసూదన్‌రెడ్డి

గంగవరం: యువకులు బైక్‌పై విన్యాసాలు.. ర్యాష్ డ్రైవింగ్.. రోడ్లపై బైక్ స్టంట్స్.. ఈ సరదాలు అనుకోని ప్రమాదాల దారితీసి మృత్యువాత పడతారని ఎంవీఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై శుక్రవారం ఎంవీఐ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, సినీనటుల కుమారులు ఎంతోమంది ర్యాష్ డ్రైవింగ్ చేసి జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, విద్యార్థులు కూడా ర్యాష్ డ్రైవింగ్‌లు చేసి ప్రాణాలమీదకి తెచ్చుకోరాదని హితవు పలికారు. 18 ఏళ్లు నిండి డ్రైవింగ్, లైసెన్స్ రెండు లేకుండా ఎట్టి పరిస్థితిలోనూ వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, అలాగే కారులో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలన్నారు. సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలన్నారు. ఉన్నత చదువులతో సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీసుధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

## ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులు


పాతకురవపల్లెలో ఆయుష్మాన్ భారత్ సర్వేలో ప్రజలకు పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

రొంపిచెర్ల: ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులను ఇస్తామని పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన ఆయుష్మాన్ భారత్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ సర్వే చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి కుటుంబంలోని వారందరినీ పరీక్షించి వారికి ఏమైనా వ్యాధులు ఉన్నాయా? అని గుర్తిస్తున్నట్టు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల వలన రూ.5 లక్షల వరకు ఆస్పత్రులలో ఉచితంగా వైద్యం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం గాయత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిప్రపత్తులతో ఆత్మార్పణ దినోత్సవం



బైరెడ్డిపల్లె: శ్రీవాసవీమాతకు మంగళ హారతులు ఇస్తున్న మహిళలు, రొంపిచెర్లలో

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీవాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు రామక్రిష్ణమాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రొంపిచెర్ల: స్థానిక బజారువీధిలోని శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు మునిరాజవర్మ అమ్మవారిని పూల మాలలతో ప్రత్యేక అలంకరించి, పూజలు చేశారు. అలాగే ఆర్య వైశ్యులు అమ్మవారికి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో శ్రీ కన్యకా పరమేశ్వర ఆలయ కమిటీ సభ్యులు రాజా, జయప్రకాష్, సుధాకర్, పట్నం కిరణ్ కుమార్, పుట్టా బాలాజీ, వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.